# నీట్ పరీక్షను రద్దు చేయాలి

### ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

మహబూబాబాద్, జూన్ 18: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, వీజేఎస్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ..నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎక్కువ మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడంలో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, ఎన్ఎస్‌యూఐ పెరుమాండ్ల చరణ్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ మాగం లోకేశ్, వీజేఎస్ బోనగిరి మధు, వీజేఎస్ జిల్లా కన్వీనర్ ఇరుగు మనోజ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాకేశ్, జిల్లా కార్యదర్శి దేవేందర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో విద్యార్థి మార్చ్ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

# నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల పట్టివేత

తొర్రూరు, జూన్ 18: ప్రభుత్వం నిషేధించిన గుట్కా, తంబాకు వంటి పొగాకు ప్యాకెట్లను మంగళవారం తొర్రూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. గుట్టు చప్పుడు కాకుండా గుట్కా, తంబాకు విక్రయాలు జరుగుతున్నట్లు పక్కా సమాచారం మేరకు పోలీసులు నిరంజన్ అనే వ్యాపారి వద్ద సోదాలు చేయగా రూ.2లక్షల విలువైన సరుకు పట్టుపడింది. రాధాకృష్ణ, ఓంకార్ అనే మరో ఇద్దరు వ్యాపారుల వద్ద సుమారు రూ.10వేల విలువ చేసే ప్యాకెట్లు దొరికినట్లు ఎస్సై తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాంజీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గుట్కా, తంబాకు ప్యాకెట్లను చూపుతున్న ఎస్సై జగదీశ్, సిబ్బంది



నర్సింహులపేటలో ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

# చేసిన కష్టం చేతికందక..!

- పస్తులుంటున్న ఉపాధి కూలీలు
- పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం.. అప్‌డేషన్ పేరుతో అవస్థలు
- నెలల తరబడి పనిచేసినా అందని డబ్బులు

*'దేవుడు కరుణించినా.. పూజారి వరమివ్వని' చందంగా మారింది నర్సింహులపేట మండలంలోని ఉపాధి కూలీల పరిస్థితి. ఎండనక, వాననక నెలల తరబడి చేసిన కష్టం చేతికందక కడుపు మాడ్చుకుంటున్నారు. డబ్బులు ఖాతాల్లో జమైనా, కేవలం పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పస్తులుంటున్నారు. అప్‌డేషన్ పేరుతో ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో డబ్బులు తీసుకునే అవకాశం లేకుండాపోయింది.*

*- నర్సింహులపేట, జూన్ 18*

నర్సింహులపేట మండలంలోని 22 గ్రామాల్లో 7500 కుటుంబాల్లో 11 వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో 4400 మంది ప్రతి రోజూ ఉపాధి పనికి వెళ్తున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. కాగా, పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి పని చేసినా డబ్బులు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. గతంలో నర్సింహులపేట మండలం దంతాలపల్లి మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీస్ పరిధిలో ఉండేవి. గతేడాది అక్టోబర్ 23న నర్సింహులపేట మండల కేంద్రంలో నూతనంగా సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఉపాధి కూలీల కష్టాలు మొదలయ్యాయి. దంతాలపల్లి నుంచి నర్సింహులపేట సబ్ పోస్టాఫీస్‌కు ఉపాధి కూలీల ఖాతాలు మార్పు చేయలేదనే కారణంతో కూలీల ఖాతాల్లో డబ్బులు జమైనా తీసుకునే అవకాశం లేకుండా అపేశారు.

దీంతో మండలంలోని పలు గ్రామాల కూలీలు మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌కు వచ్చి అప్‌డేషన్ దరఖాస్తుతో పాటు ఆధార్, జాబ్‌కార్డు జిరాక్స్‌లు అందించి నెలలు గడుస్తున్నా ఈ కేవైసీ చేయకపోవడంతో ఉపాధి పని చేసినా పైసలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. కొందరు కూలీలకు వేలల్లో, మరి కొందరికి లక్షల్లో డబ్బులు రావాల్సి ఉన్నది. నెలల తరబడి పనులు చేసినా కూలీలకు డబ్బులు రాక పోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లకు కూలీలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో పనికి వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. మండలంలో ఒక్కో కూలీకి సుమారు రూ.4వేల నుంచి రూ.20వేల వరకు ఆగిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కార్యాలయానికి వెళ్లి అడుగుదామంటే ఏపీవో అందుబాటులో ఉండడం లేదని, కార్యాలయంలో ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పది నెలల నుంచి పైసలు రాలె..



ఉపాధి పనికి పది నెలలు పోయిన. రూ. 21 వేలు వచ్చినయి. పైసల కోసం పోస్టాఫీస్‌కు పోతే ఆధార్, జాబ్ కార్డు జిరాక్స్ నర్సింహులపేటలో ఇవ్వమంటే మూడు నెలల క్రితం ఆటోలో వెళ్లి ఇచ్చిన. ఐదు రోజుల్లో పైసలు వస్తాయన్నరు. చాలాసార్లు ఎండీవో ఆఫీస్ చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. డబ్బులు వస్తాయన్న ఆశతో మా బంధువుల దగ్గర అప్పు తీసుకున్న. దయచేసి పైసలు ఇప్పించండి.

– మక్కల అక్కమ్మ, పెద్దనాగారం

### కూలీలకు డబ్బులు ఇప్పిస్తాం..



ఉపాధి కూలీలకు డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పోస్టల్ అధికారులుతో మాట్లాడినం. ఈ కేవైసీ చేయడం ఆలస్యమవడంతో డబ్బులు తీసుకునే అవకాశం లేదు. స్వయంగా పోస్టాఫీస్‌కు వెళ్లి అప్‌డేషన్ చేయించేందుకు చర్యలు తీసుకుని కూలీలకు డబ్బులు అందిస్తాం. ఏపీవో వ్యక్తిగత కారణాలతో కొన్ని రోజులుగా కార్యాలయానికి రావడం లేదు. ఏపీడీకి సమాచారం అందించాం.

–డీ శ్రీను, ఎంపీడీవో

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ సిగ్నల్ కాలనీ, మున్సిపల్ కాపురస్తులగు శ్రీ బండారి రాము, తండ్రి: బిక్షపతి, నివాసం: గ్రామము మహబూబాబాద్, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ గిఫ్ట్ దస్తావేజు నెం. 8777/2023, తేది: 07-07-2023 మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇ.నెం. 6-1-108/76/6, విస్తీర్ణం: 144 చ.గ.లు సమము 120.40 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: కొప్పుల పుష్ప గృహము, పడమర: మున్సిపాలిటీ రోడ్డు, ఉత్తరం: బండారి @ బండారు యాకలక్ష్మి (దాత) మిగతా గృహము మరియు స్థలము డోర్.నెం. 6-1-108/76/6 (పార్ట్), దక్షిణం: మున్సిపాలిటీ రోడ్డు.

తేది. 19-06-2024

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్, మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

**నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్**

**WANTED**

★ Urgent Requirement for Corporate DSA Office Fresher & Exp. Female Tele-Callers, Quali: 12th & Best Talking Skills. Vacancies-30, Sal+Incentives etc., Job Location: HNK. Cont: 9032744373.
NTW-7701

**CHANGE OF NAME**

★I, **NIMMANI SANTHOSH** (New name), H.No. 19-10-207, Shambunipet, Rangashaipet, Warangal dist.-506002, T.S., **NIMMANI SANTOSH** (Old Name), hence forth be charged as **NIMMANI SANTHOSH** for all purpose.
NTW-00

**EDUCATION**

★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

**లీజు / కిరాయి**

★ HNK, అదాలత నుండి K.L.N. రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్, (S.V.కాలనీ) రోడ్ నెం.5, 1st, 2nd, 3rd అంతస్థుల భవనం 1650Sft కిరాయికి/ లీజు ఇవ్వబడును. (న్యూ బిల్డింగ్) సంప్ర \|\| 9502879612.
KMM_11687

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

## విద్యా వలంటీర్లను నియమించాలి

దంతాలపల్లి, జూన్ 18: ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని టీవీవీఎస్ రాష్ట్ర కార్యదర్శి పంతం విజయేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో వెంటనే వలంటీర్లను నియమించాలన్నారు. ఈ సమావేశంలో వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ పునర్నిర్మాణానికి విరాళం

గార్ల, జూన్ 18: మర్రిగూడెం శ్రీ వేట వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభం గాలి దుమారానికి విరిగి నేలపై పడింది. దీంతో ఆలయంలో అర్చకులు శాంతి పూజలు చేశారు. ధ్వజ స్తంభం పునర్నిర్మాణానికి రాంపురం పులి గోపాల్‌రెడ్డి –ప్రమీల దంపతులు రూ.1,51,116, బుద్దారం గ్రామానికి చెందిన రావూరి వెంకట రామయ్య, గార్ల పట్టణానికి చెందిన పుల్లఖండం రమేశ్ బాబు రూ.11,116, పెట్రోల్ బంక్ జీవన్ లాల్ రూ.10,116, మర్రిగూడేనికి చెందిన భూక్యా రాములు రూ.11,116 ఆలయ చైర్మన్ అమర్ చందు, రూ.11,116, అజ్మీరా ప్రతాప్ సింగ్ రూ.5,116 విరాళంగా అందజేశారు.



విరాళం అందించిన గోపాల్‌రెడ్డి, ప్రమీల దంపతులు

## గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలకు వెంటనే పట్టాలివ్వాలని సీపీఐ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెవాసులకు అండగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇండ్ల పట్టాలు, ఇంటి నంబర్లను వెంటనే కేటాయించాలన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, నవీన్, పెరుగు కుమార్, అశోక్, మల్లయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18: అంగన్ వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన అధ్యక్షుడు అజయ్‌సారథి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పలువురు నాయకులతో కలిసి మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ సెంటర్లకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.25వేల వేతనం, హెల్పర్లకు రూ.21వేలు అందజేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లపై తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, సౌమ్య, పద్మ, స్వప్న, రజియా పాల్గొన్నారు.



సీడీపీవో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## ఏజెన్సీ మండలాలకు బస్సులు నడపాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. మంగళవారం ఆర్టీసీ డిప్యూటీ డీఎం శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాలైన గంగారం వంటి ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కొత్తగూడ వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును గంగారం వరకు నడిపిస్తే ప్రయాణికులకు లాభం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, వెంకట్, ఉదయ్, గౌతం పాల్గొన్నారు.



ఆర్టీసీ డిప్యూటీ డీఎం శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## రేషన్‌షాపును పునఃప్రారంభించాలి

కేసముద్రం, జూన్ 18 : మండలంలోని అమీనాపురం రేషన్‌షాపును పునఃప్రారంభించాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యుడు ఆర్‌ఐ బాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీనాపురంలో కొన్నేండ్లుగా రేషన్ బియ్యం ఇవ్వడంలేదని, గ్రామస్తులు కేసముద్రం స్టేషన్, కల్వలకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి అమీనాపురంలో బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధికార ప్రతినిధి శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు మందుల కృష్ణమూర్తి, మిట్టకడుపుల యాకయ్య అంబేద్కర్ వారసులు పాల్గొన్నారు.



ఆర్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

## పరీక్షను రద్దు చేయాలి

గార్ల, జూన్ 18. ప్రభుత్వం ఆశ వర్కర్లకు నిర్వహించనున్న పరీక్షను వెంటనే రద్దు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు బీజేపీ మహిళా విభాగం నాయకురాలు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండెబోయిన నాగమణి, చంద్రకళ, సుమలత, విజయ, మంగమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సూచిక బోర్డులు తప్పనిసరి : ఎంపీడీవో

పెద్దవంగర, జూన్18: ఉపాధి పనుల ప్రదేశాల్లో సూచిక బోర్డులు తప్పకుండా ఏర్పాటు చేయాలని ఎంపీడీవో వేణుమాధవ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, టీఏలు యాకయ్య, సురేశ్, సుమన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వేణుమాధవ్

## బావిలో పడి వృద్ధురాలి మృతి



మంగమ్మ(ఫైల్)

ఇనుగుర్తి, జూన్18 : బావిలోపడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని కోమటిపల్లిలో మంగళవారం జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. కోమటిపల్లికి చెందిన అలివేలు మంగమ్మ(80) కొద్దిరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన మంగమ్మ మంగళవారం గ్రామ శివారులోని బావిలో శవమై తేలింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్, జూన్ 18 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మంగళవారం రాత్రి ముల్కలపల్లి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..ముల్కలపల్లి గ్రామ సమీపంలో ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన రాజశేఖర్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో ఖమ్మంలోని వైద్యశాలకు తరలించారు.



సమావేశంలో మాట్లాడుతూ వైద్యాధికారి మౌనిక

## బీసీజీ వ్యాక్సిన్ తప్పని సరిగా తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18: ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవాలని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మౌనిక సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి బీసీజీ వ్యాక్సిన్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వేలో 18ఏండ్లు పైబడిన పొగ తాగే వారిని, 60ఏండ్లు పైబడిన టీబీ మందులు వాడే వారిని, టీబీ, షుగర్ పేషెంట్లను గుర్తించామని, వారు బీసీజీ వ్యాక్సిన్ వేసుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌వో, హెచ్ఏలు సక్రి, పుష్పలీల, ఇందిరా, సుభద్ర, గోవిందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్

## విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 18: నీట్ పరీక్షలో జరిగిన తప్పులపై దేశ ప్రధాని మోదీ వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రజా పంథా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజునే నీట్ ఫలితాలను వెల్లడించడంలో కుట్ర జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతం, లక్ష్మణ్, అభిషేక్, గణేశ్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

తొర్రూరు, జూన్ 18: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు పంతం విజయేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యాం అన్నారు. డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మలుచుకొని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. తక్షణమే అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే ఆయా పాఠశాలల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, ప్రవీణ, కీర్తన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయేందర్

## భగీరథ నీళ్లేవి?

### పంపు ఆపరేటర్‌ను నిలదీసిన మహిళలు

బయ్యారం, జూన్ 18: 'మిషన్ భగీరథ నీళ్లేవి..?, ఇంకెన్ని రోజులు మేము ఇబ్బంది పడాలి' అంటూ నడిరోడ్డుపై పంపు ఆపరేటర్‌ను మహిళలు నిలదీశారు. వివరాల్లోకి వెళితే.. బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ, హేమ్లాతండాలో ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదు. మూడు రోజుల నుంచి మొత్తంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన మహిళలు మంగళవారం ఎస్టీ కాలనీకి వచ్చిన పంపు ఆపరేటర్‌ను నిలదీశాలరు. ఆరు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని అధికారులకు తెలియజేస్తామనని పంపు ఆపరేటర్ వెళ్లిపోయాడు.



పంపు ఆపరేటర్‌ను నిలదీస్తున్న మహిళలు

## శునకానికి అంత్యక్రియలు

దంతాలపల్లి, జూన్ 18: ఎంతో ఇష్టంగా పెంచుకున్న శునకం మృతి చెండంతో దానిపై పెంచుకున్న ప్రేమతో ఓ యజమాని అంత్యక్రియలు నిర్వహించాడు. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన గౌడుగు మధు ఓ శునకాన్ని ఏడు సంవత్సరాలుగా ఇంట్లో కుటుంబ సభ్యుడిలా పెంచుకున్నాడు. మంగళవారం అది మృతి చెందడంతో గుంత తీసి పూడ్చి పెట్టి అంత్యక్రియలు చేశాడు.



శునకానికి అంత్యక్రియలు నిర్వహించిన మధు

## పట్టాల పక్కన మగ శిశువు మృతదేహం

డోర్నకల్, జూన్ 18 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన మగ శిశువు మృతదేహన్ని పడేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. జీఆర్పీ సురేశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మెన్ సుధాకర్ రైలు పట్టాల వెంట వెళ్తున్నాడు. 437/11-13 కి.మీ వద్ద నవజాత మగ శిశువును గుర్తించాడు. వెంటనే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించగా, జీఆర్పీ కానిస్టేబుల్ వెళ్లి శిశువును పరిశీలించి, ఐసీడీఎస్ అధికారులకు విషయం చెప్పాడు. వారు శిశువు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.